# రాత్రి రెండు గంటలు

శబ్దం మసక మసకగా తలుపులు మూసుకుంటుంది
ఊపిరి శరీరంలోకి డేగలా వాలుతుంది
భూగోళం చివరి మొనపై ఒక అస్థిపంజరం
        గులాబీ పూవును పట్టుకుని నిలబడుతుంది
కను గుడ్ల తోలు సంచీల్లో
        కదులుతూన్న గడియారపు చేతులు
        మెల్లగా చీకటిని తెరుస్తూంటాయి
నిద్రంటే ఇదేనా...
విశ్రాంతి నిజంగా ఇదేనా...
దృశ్య తుంపరల్లోకి నీలంగా మెరిసే ఓ లోతైన కళ్ళల్లోకి
        ప్రయాణం చేయడమేనా?
ఓ అందమయిన అడవి పిట్ట అమాయకంగా
        పిస్టల్‌ని గురిపెట్టే పాటను వినడమేనా
నిఘంటు పదాలను చెరిపేసి
        కేవలం తెల్ల కాగితంలా అయిపోవడమేనా?
ఒక చోట భయానక సంగీతానికి
        కిటికీ అతికిస్తుంటారు.
గాలినీ, సముద్రాన్నీ, ఉక్కపోతనీ, నరాల తిత్తుల్లోకి
        ప్రవాహంగా పోస్తుంటారు
అసంఖ్యాక మనుషుల గుండెలు మంటలై
        అంటుకోవడం కనపడుతుంది
ఖండాలయి రక్తాన్ని చిమ్మే అవయవాల దొంతరల్లో
        ఓ చిరిగిన ముఖాన్ని వెదుకుతూంటారు

వెచ్చగా ఉప్పగా గదిలోకి

ఒక కన్నీటి తడి ప్రవేశిస్తుంది

పుస్తకావిష్కరణ సభలూ

ఎన్నికల మోతలూ

టెలివిజన్‌లో రక్తాన్ని పులుముకుని నవ్వే జింకలూ

పలుగులూ పారల వెనుక

సైనైడ్ కలల్ని మోస్తున్న  మెడలూ కనబడతాయి.

నిద్రంటే ఇదేనా?

చచ్చిపోయిన నాగుపాము కమిలిన శరీరంతో భయపెడుతుంది

సిమెంట్ గొట్టాల్లోని పిచ్చివాడి ఒంటరితనంలా ఉంటుంది

ఓ ఎత్తైన జామ చెట్టుపై నిలబడ్డ

గబ్బిలపు చిరుగుల రెక్కలా ఉంటుంది

ఒక వీధిలోంచి ఒకర్ని

ఒకరి ఊరి నుంచి ఒకర్ని

తరిమే బ్లేడ్లలాంటి వేళ్ళూ,

ఓ గండు చీమ కన్నుల్లో తడుస్తూన్న వెన్నెల,

మహా పర్వతాల భుజాలపైంచి ఎవలెంచెస్‌లా జారుతూన్న

విశాలపు నీలం దుస్తులూ కనిపిస్తాయి.

మెల్లగా జరిగే ఓ శరీరపు లాలన

ధైర్యంలా స్పర్శై తగులుతుంది.

తెల్లవారినట్టుగా ఓ చెట్టు కిటికీలోంచి

నిశ్శబ్దంగా వీస్తుంటుంది.

సిద్ధార్థ

(‘దీపశిల’ – 1994)